మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రిలో మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు బుధవారం విజయవంతంగా నిర్వహించామని సూపరింటెండెంట్ రాజునాయుడు తెలిపారు. గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి, మోకీలు మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు పోట్ల శివయ్య అందించిన సాంకేతిక సహకారంతో ఒకే రోజు ఇద్దరికి సర్జరీలు పూర్తి చేయగలిగామన్నారు. వెంకటరమణ(65), ఎం.లక్ష్మి(60) అనే ఇద్దరు మహిళలు మోకాళ్ల నొప్పులు తట్టుకోలేక, నడవాలంటే నరకం అనుభవిస్తూ ఆసుపత్రికి రాగా గత కొంతకాలం నుంచి వైద్యులు పరీక్షించి ఆపరేషన్ సర్జరీ చేయాలని నిర్ణయించారన్నారు. మాడ్యులర్ ఆపరేషన్ శస్త్రచికిత్స మందిరంలో సర్జరీలు చేస్తున్నందున రోగులకు ఎంతో మేలు జరుగుతున్నదన్నారు. సర్జరీ అనంతరం వారం రోజుల పాటు ప్రత్యేక ఐసీయూలో రోగులను ఉంచి నైపుణ్యవంతమైన నర్సింగ్ సేవలు అందేవిధంగా చూస్తున్నామన్నారు. వైద్యుల పర్యవేక్షణలో ఫిజియోథెరపీ చేయిస్తున్నామన్నారు. ఎముకలు, కీళ్ల శస్త్రచికిత్స విభాగం అధిపతి వరప్రసాద్ నేతృత్వంలో వైద్యుల బృందం మోకీలు మార్పిడి సర్జరీలు చేసినట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో సందీప్, అన్నపూర్ణశర్మ, భవాని ఇతర సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు. అత్యంత ఖరీదైన ఈ సర్జరీలు జీజీహెచ్‌లో ప్రతి బుధ, శని వారాల్లో పూర్తి ఉచితంగానే చేస్తున్నట్లు తెలిపారు.

శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్యుల బృందంలో శివయ్య, వరప్రసాద్ తదితరులు